అర్హతున్న ప్రతిఒక్కరికీ పెన్షన్

జిల్లాలో పెన్షన్ల సొమ్ము రూ.97.40 కోట్లు విడుదల: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ అక్టోబర్ 1న ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి రూ.97.40 కోట్లు సొమ్ము విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న పండుగ సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్ సొమ్ము బ్యాంకుల నుండి డ్రా చేసి సిద్ధం చేశారని, అక్టోబర్ 1న పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సంబంధిత సిబ్బంది ఉదయం నుండి పెన్షన్ల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. పంపిణీలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

సుంకాల సుడిలో ఆక్వా విలవిల

లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రకటనలకే పరిమితమైన పాలకులు

రొయ్యల పట్టుబడి

ప్రజాశక్తి - కాళ్ల

డాలర్ పంటగా పేరొందిన ఆక్వా సాగు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కుదేలవుతోంది. ఏటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకూ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా సుంకాల దాడితో ఆక్వా రంగం విలవిల్లాడుతోంది.

విదేశాలకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో రొయ్యలు 1.10 లక్షల ఎకరాల్లోనూ, చేపలు 1.80 లక్షల ఎకరాల్లోనూ సాగవుతున్నాయి.

ఉప్పుటేరు, కొల్లేరు ప్రాంతాల్లో ప్రధానంగా వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. రూ.18 వేల కోట్లు వార్షిక టర్నోవర్ సాగుతోంది. ఇంత విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా ఆ రంగం సంక్షోభంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వనరుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక ఏడేళ్ల నుంచి ఆక్వా రైతులు నష్టాల బాటలో పయనిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ ఛార్జీల భారం గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఆందోళనల ఫలితంగా రొయ్యల మేత, ముడి సరుకు ధరలు తగ్గినా మేత ధరలు తగ్గడం లేదు. ఈ క్రమంలోనే అమెరికా టారిఫ్ దాడి ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తోంది.

తక్కువ ధరకు రొయ్యల కొనుగోలు

అమెరికా సుంకాల భారం చూపి స్థానిక వ్యాపారులు, దళారులు రొయ్యల రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సగానికి సగం ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

ప్రస్తుతం ధరలు

25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.680 పలికేది. ట్రంప్ నోట టారిఫ్ మాట వచ్చిందో, లేదో వ్యాపారులు సిండికేటయ్యి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.460, 30 కౌంట్ ధర కేజీ రూ.395, వనామీ రకం 30 నుంచి 40 కౌంట్ రూ.370, 100 కౌంట్ ధర కేజీ రూ.210 పలుకుతోంది.

లక్షల కుటుంబాల ఉపాధిపై పెను ప్రభావం

ఆక్వా రంగంపై ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఇవేగాక ప్రాసెసింగ్ యూనిట్లలోను, రొయ్యల పిల్లలు ఉత్పత్తి చేసే హేచరీస్‌లో పని చేసే అసంఘటిత కార్మికుల సంఖ్య కూడా లక్షల్లోనే ఉంది. ఎగుమతులు పడిపోతే ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. సాగు కుదించుకుపోయి దిగుబడి తగ్గిపోతుంది. దీంతో ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభావం పడి ఉపాధి దెబ్బతింటుంది. వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టం

వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.270 ఉంటే ప్రస్తుతం రూ.210గా ఉంది. 60 కౌంట్ ధర రూ.305కు పడిపోయింది. ప్రతి కౌంట్‌కూ రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గింది. దీన్ని బట్టి చూస్తే సాగుదారులు ఎకరాకు రూ.40 వేల నుంచి కౌంట్‌ను బట్టి రూ.2 లక్షలు వరకూ నష్టపోతున్నారు.

ఆక్వా ఎగుమతులకు అమెరికా మార్కెట్‌కు బదులు ఇతర దేశాల్లోని కొత్త మార్కెట్లు అన్వేషించాలి. ఎగుమతి సబ్సిడీలు, పన్ను రాయితీలు, ప్రభావితమైన రంగాలకు తాత్కాలిక సహాయం అందించాలి. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ యూనిట్ రూ.1.50కే అందించాలి

రొయ్యల రైతులందరికీ సబ్సిడీతో ఎలాంటి అదనపు ఛార్జీలూ లేకుండా విద్యుత్‌ను యూనిట్ రూ.1.50కే అందించాలి. తగ్గిన సోయా ధరలకు అనుగుణంగా రొయ్యల ఫీడ్ ధరలను కనీసం కిలోకు రూ.15కు తగ్గించాలి. రొయ్యల సాగులో ఉపయోగించే కెమికల్స్, మినరల్స్ ధరలను కనీసం 30 శాతం తగ్గించాలి. కనీస మద్దతు ధరను వనామీ రొయ్యలు కిలో 100 కౌంట్‌కు రూ.270, 30 కౌంట్‌కు రూ.400కు తగ్గకుండా ఎగుమతిదారులతో నేరుగా కొనుగోలు చేయించాలి. ధరలు తగ్గిన పరిస్థితుల్లో తగ్గిన ధరను ప్రభుత్వం బోనస్ రూపంలో రైతులకు చెల్లించి ఆదుకోవాలి.

సబ్సిడీపై దాణా సరఫరా చేయాలి

కిలో దాణాకు రూ.4 తగ్గించాలని రైతులు డిమాండ్ చేయగా కూటమి సర్కార్ కేవలం రూ.2 తగ్గించి చేతులు దులుపుకుంది. దాణాపై మరింత సబ్సిడీ ఇవ్వాలని, లేదా ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరుతున్నారు. రొయ్యలకు వాడే మందులు, వాటర్ ప్రొ(బ్రా)యిటిక్, మినరల్, ఆక్సిజన్ టాబ్లెట్స్ తదితర వాటి రేట్లు కూడా పెరుగుతున్నాయి. గత సంవత్సరం కిలో ఆక్సిజన్ టాబ్లెట్ రూ.350 ఉంటే ఇప్పుడు రూ.400 పెరిగింది.

విద్యుత్ బిల్లులు అధికం

ముదుండి మణిబాబు, ఆక్వా రైతు, కలవపూడి

రొయ్యల ఉత్పత్తిలో కరెంటు వాడకం కీలకంగా మారింది. ఏడెకరాలకు సంబంధించిన రైతుకు కరెంట్ బిల్లు రూ.40 వేలు వచ్చింది. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేలు వరకు బిల్లు వచ్చింది. రాయితీ ఇచ్చినట్లు ఇచ్చి ట్రూఅప్ ఛార్జీల పేరుతో వెనక్కి గుంజుకుంటున్నారు. కాబట్టి ట్రూఅప్ ఛార్జీలు ఎత్తివేయాలి.

100 కౌంట్ రొయ్యలకు రూ.270 మద్దతు ధర ప్రకటించాలి

ఆకుల హరేరాం, ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి, భీమవరం

అమెరికాకు 20, 30 కౌంట్ల రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. 60 కౌంట్ నుంచి 100 కౌంట్ వరకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రస్తుతం 100 కౌంట్ రూ.210కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు కిలోకు రూ.50కుపైగా నష్టపోతున్నారు. ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని 100 కౌంట్ రొయ్యలు కిలో కనీస మద్దతు ధర రూ.270గా ప్రకటించి, అది అమలయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షించాలి. సన్న, చిన్నకారు రైతులందరికీ విద్యుత్ రాయితీ వర్తింపజేయాలి. హేచరీలపై ప్రభుత్వ అజమాయిషీ తప్పనిసరి. ప్రభుత్వ హాస్టళ్లు, ఇతర సంస్థల్లో 15 రోజులకు ఒకసారి రొయ్యలను ఫుడ్ మెనూలో చేర్చాలి. తద్వారా స్థానికంగానే రొయ్య వినియోగం పెరిగి రైతులు నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది.

అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను పారదర్శకంగా, నాణ్యతతో నిర్ణీత గడువులోపుగా పరిష్కరించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, పిజిఆర్ఎస్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

కొత్త ఉపాధ్యాయులకు అభినందన

విద్యార్థులకు మంచి బోధనతో ప్రేరణ కలిగించాలి: కలెక్టర్

జ్ఞాపికలు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మెగా డిఎస్‌సి నిరుద్యోగులకు వరమని, ఉపాధ్యాయులుగా నియమితులైన వారంతా విద్యార్థులకు చక్కగా పాఠాలు చెప్పి మంచి ప్రేరణ కలిగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది, మెగా డిఎస్‌సిలో ఎంపికైన 9 మంది ఉపాధ్యాయులకు కలెక్టర్ జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావంతో విధులను నిర్వర్తించి విద్యార్థులకు మంచి విద్యాబోధనతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలని కోరారు. ఉపాధ్యాయులు వెలగల రమ్యశ్రీ, మంగిశెట్టి శ్రీనివాస్, మోకా సిలోరత్నం, జి.వెంకటసుబ్బారావు, బి.రమ్య, ఎఎన్.సాయిప్రసన్న, టి.సాయిలక్ష్మి మృదుల, గుబ్బల రూపేంద్ర, షేక్ మున్నీ మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎ.సూరిబాబు, డిఇఒ ఇ.నారాయణ, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, సిపిఒ కె.శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్యం కోసం నిరీక్షణ

పిహెచ్‌సి వైద్యుల సమ్మెబాట

కాళ్ల పిహెచ్‌సిలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

ప్రజాశక్తి - కాళ్ల

పిహెచ్‌సి వైద్యులు అత్యవసర సేవలకు మాత్రమే మినహాయింపు ఇస్తూ.. డిమాండ్ల సాధనకు పిడికిలి బిగించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మెబాట పట్టారు. దీంతో పల్లె వైద్యానికి ఆటంకం ఏర్పడింది. వైద్యులు సోమవారం నుంచి సమ్మెకు దిగడంతో కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒపి సేవలను వైద్యసిబ్బంది నిర్వహించారు. వైద్యులు సమ్మె కు వెళ్లడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించవలసి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ ఫీవర్స్ పట్టి పీడిస్తున్న తరుణంలో డాక్టర్లు సమ్మెలోకి వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అయినా కూడా పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆర్థిక స్తోమత ఉన్నవారు ఆర్ఎంపి, ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు పిహెచ్‌సికి క్యూకట్టారు. ఇలాంటి తరుణంలో డాక్టర్ల సమ్మె పేద రోగులకు ఇబ్బందికరంగా మారింది. ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఉండి : తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యులు సోమవారం ఒపి సేవలను బహిష్కరించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ పి.సునంద మాట్లాడుతూ అత్యవసర సేవల కోసం తాము పనిచేస్తామని, సాధారణ సేవలకు పిహెచ్‌సిలోని స్టాఫ్‌నర్సులు, మిగిలిన వైద్య సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సేవలు కుంటుపడతాయన్నారు. జిఒ 99 ద్వారా కోత విధించిన ఇన్‌పుట్ సర్వీస్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. సమయ నిర్ధారితమైన ప్రమోషన్లు ఇవ్వాలని యండగండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బెన్నీ శామ్యూల్ రాజు కోరారు.

ఆచంట : పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరించడంతో వైద్యులు పోరుబాట పట్టారు. ఈ తరహాలో మండలంలోని వల్లూరు, ఆచంట వేమవరం గ్రామాల్లో ఉన్న పిహెచ్‌సిలు సోమవారం బోసిపోయాయి. దీంతో రోగులకు అందవలసిన సేవలు నిలిచిపోవడంతో వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోవడంతో ఆస్పత్రి ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించే డాక్టర్ల సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొండంతో వైద్యులు పోరుబాట పట్టారు.

అమెరికా సుంకాలతో ఆక్వా రైతులు కుదేలు

పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల అమెరికా విధించిన సుంకాలతో ఆక్వా రైతులు కుదేలయ్యారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. పాలకోడేరులో సోమవారం సిపిఎం మండల కమిటీ సమావేశం నాయకులు కొటికలపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బలరాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ట్రంప్ విధించిన సుంకం కారణంగా జిల్లాలో ఆక్వారంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, ఆక్వా రైతుల సమస్యలపై కనీసం ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. కనీసం ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర లేదని, కేరళ తరహాలో క్వింటాకు రూ.600 పెంచి రూ.3 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటిని బిగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫలితంగా విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో సామాన్య ప్రజానీకం సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య మాట్లాడుతూ మండలంలో ఇటీవల కాలంలో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి విజయం సాధించామని చెప్పారు. కొన్ని దీర్ఘకాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు దున్న మరియమ్మ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, అప్పారావు, గోపాల రాజు పాల్గొన్నారు.

వశిష్ట గోదావరి వరద తగ్గుముఖం

ఆచంట: గోదావరి వరద ఉధృతి

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఏడు అడుగుల మేర పెరిగిన గోదావరి వరద, ఆపై తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి రెండు అడుగుల నీటిమట్టం తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వరద ఇంకా ఉధృతంగానే ఉండటంతో లంక గ్రామాల మధ్య పడవల రాకపోకలను అధికారులు అనుమతించడం లేదు. లంక గ్రామాలకు ఎటువంటి ప్రమాదమూ లేదని తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు.

యలమంచిలి: గోదావరి వరద సోమవారం సాయంత్రం వరకు ఉధృతంగానే కొనసాగడంతో కనకాయలంక కాజ్‌వే నీటి మునకలోనే ఉంది. దీంతో అక్కడి ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద పరిస్థితిని తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

యనమదుర్రు వంతెనకు అప్రోచ్ రోడ్లు వేయాలి

సిపిఎం ఆధ్వర్యాన మోటారు సైకిల్ యాత్ర

నినదిస్తున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు వెంటనే అప్రోచ్ రోడ్లు వేయాలని, అక్టోబర్ మూడో తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని తోకతిప్ప వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అక్కడే మోటారు సైకిల్ యాత్ర ప్రారంభించారు. యాత్ర తోకతిప్ప నుంచి బర్రెవానిపేట, నాగిడిపాలెం, నాగేంద్రపురం, గొల్లవానితిప్ప, రామాయణపురం, దిరుసుమర్రు, యనమదుర్రు మీదుగా భీమవరం కెజిఆర్ఎల్ కళాశాల వరకూ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ యనమదురు రోడ్డు, గొల్లవానితిప్ప రోడ్డు జాతీయ రహదారులకు లింక్ రోడ్లు కావడం, ఆక్వా కల్చర్ అభివృద్ధి, భీమవరం జిల్లా కేంద్రం కావడంతో ట్రాఫిక్ పెరిగిందన్నారు. ఈ వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించి వాడుకలోకి తీసుకొస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోరుతూ అక్టోబర్ 3న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, బొడ్డు సింధు, తిరుమాని నాగేశ్వరరావు, తోటి శుభకర్‌రావు, పొన్నమండ నాగేశ్వరరావు, మైలా శ్రీను, పట్టిం శుభకర రావు పాల్గొన్నారు.

ధాన్యానికి వేళాయే.. జెసి లేరాయే..!

- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు
- ఆ శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీ
- ధాన్యం కొనుగోలులో కీలక పాత్ర జెసిలదే
- జెసి నియామకంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టి సారించేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సమయం ఆసన్నమైంది. అక్టోబర్ రెండో వారం నుంచే ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 10.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభు త్వం టార్గెట్‌గా నిర్ణయించింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థి తి కన్పిస్తోంది. అందుకు ప్రధాన కారణం పౌర సరఫరాల శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండిపోవడమే. ధాన్యం కొనుగోలులో జెసిలదే కీలకపాత్ర. పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖాధికారులతో నిరంతరం పర్య వేక్షణ చేస్తూ.. సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత జెసిలపైనే ఉంటుంది. ముఖ్యంగా పెద్దఎత్తున ధాన్యం దిగుబడి వచ్చే ఏలూ రు జిల్లాలో జాయింట్ కలెక్టర్ పాత్ర మరింత కీలకంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన ఖరీఫ్, రబీల్లో ధాన్యం కొనుగోలులో జెసి ధాత్రిరెడ్డి కీలకపాత్ర పోషించారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే పరిష్కరించేవారు. సంచులు, వాహనాలు, తూకం వంటి ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే చర్యలు తీసుకుని రైతులకు ఊరట కల్గించేవారు. దీంతో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేది. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇటీవల జరిగిన ఐఎఎస్‌ల బదిలీల్లో భాగంగా జెసిగా ఉన్న ధాత్రిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒగా నియమించింది. జెసి బదిలీ జరిగి రెండు వారాలు దాటిపోయింది. ఇప్పటి వరకూ జెసి స్థానంలో మరో ఐఎఎస్ అధికా రిని ప్రభుత్వం నియమించలేదు. దీంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వినే జెసి బాధ్యతలను సైతం చూస్తున్నారు. జిల్లా కలెక్టర్ నిరంతరం అన్ని శాఖలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పౌర సరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించడం అసాధ్యమనే చెప్పాలి. పౌరసరఫరాల శాఖాధికారులు సైతం నిరంతరం బిజీగా ఉండే కలెక్టర్‌ను కలిసి సమస్యలను నివేదించడం సాధ్యం కాకపోవచ్చు.

జెసి లేకపోతే ఇక్కట్లే

జెసి నియామకం జరగకపోతే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మొత్తంగా 5.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 261 ఆర్ఎస్‌కెలు, 130 సహకార సంఘాల ఆధ్వర్యంలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇంత పెద్దమొత్తంలో ధాన్యం కొనుగోలు జరగాలంటే పౌర సరఫరాల శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఉండటం అత్యంత అవసరం. ఏదైనా సమస్య ఎదురైతే రాష్ట్రస్థాయి అధికారు లతో మాట్లాడి పరిష్కరించాలంటే జెసి స్థాయి అధికారి కచ్చితంగా ఉండాలి. ఎందుకంటే ధాన్యం కొనుగోలులో వచ్చే సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం పరిష్కరించాల్సి ఉం టుంది. ఏమాత్రం ఆలస్యమైనా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గడిచిన రబీలో ధా న్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం టార్గెట్ తక్కువ ఇచ్చింది. దీంతో రైతులు ధాన్యం అమ్ముకు నేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో జెసి కలెక్టర్‌తోనూ, మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడి టార్గెట్‌ను పెంచేం దుకు కృషి చేసి సమస్యను పరిష్కరించారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగడంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, ఎంఎల్‌ఎలు సైతం జెసిని అభినందించిన పరిస్థితి ఉంది. జెసి పోస్టు ఖాళీగా ఉండటంతో ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు పరిస్థితి ఎలా ఉంటు oదోననే చర్చ సర్వత్రా నడుస్తోంది.

పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సమస్యపై దృష్టి సారించేనా?

ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాల శాఖదే కీలక పాత్ర. ఆ శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సైతం ఉన్నారు. ఆ శాఖను పర్యవేక్షించే జెసి పోస్టు ఖాళీగా ఉండటంపై ఆయన దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బంది పెడితే పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న ఆయనకే చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది. జెసి లేకపోవడంతో వివిధ శాఖలకు సంబంధించిన అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉండిపోయినట్లు తెలుస్తోంది. ఇన్‌ఛార్జి మంత్రి జోక్యం చేసుకుని వెంటనే జెసి నియామకం చేపట్టి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంతా కోరుతున్నారు.

ప్రమాదకరంగా దత్తు బార్ అండ్ రెస్టారెంట్

తొలగించాలని సిఐటియు, ఎస్ఎఫ్ఐ నేతల వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నరసాపురం

రోడ్డు ప్రమాదాలకు నిలయంగా, కాలేజీకి వెళ్లి వచ్చే అమ్మాయిలకు, మహిళలకు ప్రమాదకరంగా, ఇబ్బందికరంగా అవాంఛనీయమైన సంఘటనలు జరిగేలా 216 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దత్తు బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని సిఐటియు, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యాన స్థానిక ఎక్సైజ్ పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ పట్టణంలో 216 జాతీయ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన దత్తు బార్ అండ్ రెస్టారెంట్ పక్కనుండి రోజు వందలాది మంది విద్యార్థులు బస్టాండ్ నుండి సూర్య కాలేజీకి, కాలేజీ నుండి బస్టాండుకు వెళుతుంటారని, ఈ మార్గంలో బార్ అండ్ రెస్టారెంట్ ఉండటం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మాయిలపై అవాంఛనీయ సంఘటనలు జరిగే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇదే మార్గం గుండా ఒకటో వార్డు, రెండో వార్డు ప్రజానీకం మార్కెట్‌కి, బస్టాండ్‌కు రోజు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ బార్ వల్ల ఆయా వార్డుల ప్రజానీకం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మరోపక్క బార్ పక్కనే ఉన్న నవజనని హాస్పటల్‌కు నిత్యం ఆరోగ్య సమస్యలతో వచ్చే ప్రజానీకానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ బార్ అండ్ రెస్టారెంట్ నుండి మందు తాగి బయటకు వచ్చే మందుబాబులు నేరుగా జాతీయ రహదారి మీదకు వచ్చి వెళ్లే సందర్భంలో ప్రమాదాలు జరిగి ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడే అవకాశముందన్నారు. ఈ బార్‌ను తక్షణం తొలగించాలని ఎక్సైజ్ ఎస్ఐ జైనులాబుద్దీన్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నోములకొండ బూడిద జోగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.చందు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ మెగా వైద్య శిబిరం ప్రారంభంలో మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం తద్వారా దేశం బాగుంటుందని, ఆ ఉద్దేశ్యంతోనే మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రధాని మోడీ పుట్టినరోజున ప్రారంభమైన ఈ పథకంలో ఉచితంగా వైద్య సేవలు, స్క్రీనింగ్ పరీక్షలు, ఉచితంగా మందులు వంటివి అందజేసి వైద్యులు తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలకు వీలుంటుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా మెలిగేందుకే ఏడాదికి 3 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళల కోసం ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు మాట ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ మాధురి, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, దనాని సూర్య ప్రకాష్, అల్లం తాతాజీ, పొట్నూరి శ్రీనివాస్, కొరగింజల రవి, మల్లుల వెంకట్, చిన్నిమిల్లి గణపతి, జనసేన నాయకులు పాల్గొన్నారు.


పాలకొల్లులో మెగా వైద్యశిబిరం ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల


భీమవరం : వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం : ఆరోగ్యవంతమైన మహిళ ద్వారా బలమైన కుటుంబం ఏర్పడుతుందని, మహిళ కుటుంబానికి వెన్నుముకని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మహిళా ఉద్యోగినిల కోసం ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళలు కూడా సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం లేదని దీనివల్ల వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష 5 వేల 425 వైద్య పరీక్షలను పూర్తి చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా 249 మంది మహిళలలో కేన్సర్ నిర్ధారణ జరిగిందన్నారు. కేన్సర్ పరీక్షలను, స్త్రీలకి సంబంధించిన వ్యాధులపై కూడా అవగాహన కల్పిస్తూ గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడారు. ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి, ఎన్‌టిఆర్ భరోసా డిస్ట్రిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, డిఐఒ డాక్టర్ దేవ సుధాలక్ష్మి, జిల్లా టిబి, లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.రవిబాబు, డిపిఎంఒ ధనలక్ష్మి, డిప్యూటీ డెమో ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ హెచ్ఇఒ వివిఎస్ఆర్‌కె.కుమారి, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

ఉండి : స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని మండలంలోని చిలుకూరు గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు అన్నారు. సోమవారం మండలంలోని చిలుకూరు, ఉండి, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాలలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మంది స్త్రీలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు, బ్రెస్ట్ కేన్సర్ టెస్టులు వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి వెంకట సోమరాజు మాట్లాడారు. పిహెచ్‌సి వైద్యులు పోరుబాట పట్టడంతో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు ఎమ్ఎల్‌హెచ్‌పి దుర్గ, ఎఎన్ఎం ఉష, పిహెచ్‌సి పిహెచ్ఎన్.ఇప్పి కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వీరవాసరం : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఉత్తరపాలెం సచివాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి కోడి వరలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబ ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆరోగ్యపరంగా మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వపరంగా అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారులు వివరించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ పి.ప్రభాకర్‌రావు, కార్యదర్శి పి.మురళీ, దైవకృప, వేణు, ఈశ్వరి పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రజలందరికీ వైద్యం, ఆరోగ్యం అందాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేస్తుందని ఆలమూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి.అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆలమూరు, ఓడూరు గ్రామాల్లోని గ్రామీణ హెల్త్ సెంటర్‌లలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 112 మంది వైద్య సేవలందుకున్నారు. ఆలమూరు గ్రామంలో 104 మందికి ఒపి చేశారు. ఓడూరు గ్రామ సర్పంచి బి.రవికుమార్, ఉప సర్పంచి సాయిరాజు, కూటమి నాయకులు సాగునీటి సంఘం ప్రెసిడెంట్ ఇందుకూరి నరసింహారాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా చిత్తరంజన్

పెనుమంట్ర : మండల కేంద్రంలో సిఐటియు 4వ మహాసభ సోమవారం స్థానిక నాయకులు మాదాసు లక్ష్మణరావు, గోగులమండ రామలక్ష్మీ, సూర్య ప్రభ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిఐటియు మండల నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు కన్వీనర్‌గా నేతల చిత్త రంజన్, కోకన్వీనర్‌గా నార్కమల్లి ప్రశాంతి, మరో 15 మంది సభ్యులతో మండల కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సిఐటియు నాయకులు సూర్నీడి వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక నాయకులు కోడె శ్రీనివాస ప్రసాద్, కె.సుబ్బరాజు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో వైద్యులు లేక పురిటోనే బిడ్డ మృతి

పొంతనలేని సమాధానాలతో వైద్యులు, సిబ్బంది

ఆకివీడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి పురుడు పోసుకునేందుకు సోమవారం ఉదయం స్థానిక సమతా నగర్‌కు చెందిన శ్రావణి వచ్చింది. ఆమె భర్త పౌలుతో కలిసి ఉదయం తొమ్మిది గంటలకు ముందే ఆసుపత్రి చేరింది. అయితే ఆ సమయానికి విధులకు హాజరు కావలసిన వైద్యులు ఒకరు రాలేదు. దీంతో ఆసుపత్రిలో ఉన్న నర్సు పురుడు పోసింది. బిడ్డ మరణించింది. కుటుంబీకులు నర్సును ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు వచ్చాయి. బిడ్డ కోల్పోయిన తల్లి మాత్రం తీవ్ర దుఖంతో ఉంది. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

డాక్టర్ బాబ్జికి సిపిఎం నేతల పరామర్శ

పాలకొల్లు : ఇటీవల కుమారుడిని కోల్పోయిన పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జిని సోమవారం సాయంత్రం సిపిఎం నేతలు పరామర్శించారు. వారిలో సీనియర్ నేత చించినాడ గ్రామ మాజీ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సిపిఎం యలమంచిలి మండల నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ఇరగవరం(తణుకు) : ఇరగవరం మండలంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కమిటీ సమావేశం పొదలాడ గ్రామంలో జుత్తిగ రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రతాప్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వైఎస్ఆర్ కాలనీకి స్థలాలు కేటాయించి కొన్ని ఇల్లు నిర్మాణం చేసిన వారికి ఇప్పటికి ప్రభుత్వం సరైన మౌలిక సౌకర్యాలు కల్పించలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలతో ఉద్యమాలను నిర్మిస్తామని ఆయన తెలియజేశారు. సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి, మండల కమిటీ సభ్యులు జుత్తిగ రామాంజనేయులు, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

నేడు యధావిధిగా ఇఆర్ఒ కౌంటర్‌లు : ఇఇ

నరసాపురం : నరసాపురం, పాలకొల్లు విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ఈర్వో కౌంటర్‌లు తెరిచి ఉండనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మంగళవారం కూడా విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ బిల్లులు కట్టించుకోనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఇఇ మధు కుమార్ సూచించారు.

'గోతులో దిగబడిన చేపల మేత లోడు లారీ'

గోతులో దిగబడిన లారీ

గణపవరం : గణపవరం మార్కెట్ యార్డు లోపలికి వెళ్లేదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దిగిపోయి చిన్నపాటి చెరువుగా మారింది. అయితే మార్కెట్ యార్డుకి సంబంధించిన వారు పట్టించుకోకపోవటం వల్ల సోమవారం చత్తీస్‌ఘడ్ నుండి చేపలమేత తీసుకువచ్చిన లారీ మార్కెట్‌యార్డులోకి వెళుతుండగా రోడ్డు మీద దిగిపోయింది. లారీ వెనుక భాగం భూమిలోకి పూర్తిగా దిగిపోవటంతో లారీ డ్రైవర్ ఇబ్బందులు పడుతున్నాడు. లారీ ఉదయం దిగిపోయినా ఇంతవరకు మార్కెట్ యార్డుకి సంబంధించిన బాధ్యులు రాలేదని డ్రైవర్ ఆవేదన వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డు వద్ద లోడుతో ఉన్న లారీ రోడ్డుపై దిగిపోయినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతి ఒక్కరూ వ్యాయమం చేయాలి

డాక్టర్ చెరుకూరి సురేష్‌బాబు

పాలకొల్లు : ప్రతి ఒక్కరూ వ్యాయమం గాని, వాకింగ్ గాని నిత్యం చేయాలని సీనియర్ వైద్యులు డాక్టర్ చెరుకూరి సురేష్ బాబు కోరారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పాలకొల్లు యునైటెడ్ కాపు క్లబ్ తరపున ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావు, కార్యదర్శి గుండుమోగుల వీరాస్వామి, కోశాధికారి కొండ్రెడ్డి సూరిబాబు, ఫౌండర్ పోకల రాము, కొమ్ముల మురళీ, జక్కంపూడి మదన్, సిరిగినీడి నాగార్జున, యర్రంశెట్టి వెంకటరత్నం, పశ్చావుల రవి, గంధం ఏసుపాదం, కర్ర నరసింహారావు, రంగయ్య పాల్గొన్నారు.

గుండె జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నుండి మెడ్ యునైటెడ్ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. నినాదాలతో ప్రజలకు గుండె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడ్ యునైటెడ్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వై.హృదయమోహన్ మాట్లాడారు. నిపుణులైన వైద్య బృందంతో ఎటువంటి వైద్య అవసరమైన 24/7 అందుబాటులో ఉంటామని తెలియజేశారు.

5న అరుణాచలానికి బస్సు

తాడేపల్లిగూడెం : అరుణాచలగిరి ప్రదక్షణ యాత్ర బస్సు అక్టోబర్ 5వ తేదీ రాత్రి 7 గంటలకు ఎపిఎస్ఆర్‌టిసి తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ నుండి బయలు దేరుతుందని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ పి.దానమ్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు 6వ తేదీన ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని అక్కడ స్వామివారి దర్శనం చేసుకుని, తదనంతరం కాణిపాక విఘ్నేశ్వర స్వామివారి క్షేత్రానికి చేరి, అదేరోజు రాత్రి శ్రీపురం శ్రీమహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ అమ్మవారి దర్శనం అయిన తర్వాత 7వ తేదీ పౌర్ణమి రోజు తెల్లవారుజామున రెండు గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం తాడేపల్లిగూడెంకి తిరుగు ప్రయాణం ప్రారంభమై, 8వ తేదీ ఉదయం తాడేపల్లిగూడెం చేరుకుంటుందన్నారు. ఛార్జీ కేవలం రూ.2,600 ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ నానమ్మ తెలిపారు. మరిన్ని వివరాలకు కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

తాడేపల్లిగూడెం : ప్రగల్బాలు పలికే నోటికన్నా సాయం చేసే చేతులు మిన్న అని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిఎస్‌టి సంస్కరణలలో భాగంగా మహిళా సాధికారతకు భరోసా ఇవ్వాలనే సదుద్దేశంతో ప్రభుత్వం రోజువారి ఉపయోగించే వివిధ రకాల వస్తువులపై జిఎస్‌టి 0 శాతం లేదా ఐదు శాతం తగ్గించిన నేపథ్యంలో స్థానిక సీతారాంపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసి గెలిపించిన రాష్ట్ర ఓటరు అవసరాలను తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఏనాడు వెనకాడదన్నారు. స్వచ్ఛ ఉత్సవ్ - స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరమణ, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, కార్యాలయపు సిబ్బంది, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రెసిడెంట్ గుండుమోగుల పద్మప్రియ పాల్గొన్నారు.

ఆచంట : ప్రభుత్వం నిర్దేశించిన మేరకు జిఎస్‌టి తగ్గింపుపై మండల కేంద్రంలో క్యాంపెయిన్ నిర్వహించారు. నిత్యావసరాలు, మందులు, ఫాన్సీ, ఇతర వస్తువులపై తగ్గిన ట్యాక్స్ వల్ల కుటుంబాలకు, రైతులు, విద్యార్థులు, వైద్యం పొందే వారికి ఒనగూడే ప్రయోజనాలు మీటింగ్స్, ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ ద్వారా వివరించారు. వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ జి.ఉషా సత్యదేవి, ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, ఎఒ బాబ్జీ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గణపవరం : సూపర్ జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సోమవారం అధికారులు గణపవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ జిఎస్‌టిఇ 2.0 సంస్కరణలతో ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతుందని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఉండి : యువత వ్యసనాలకు లోనుకాకుండా బ్యాడ్మింటన్ వంటి క్రీడలను ఆడటం ద్వారా ఒత్తిడిని జయించి మానసిక ధైర్యాన్ని అలవర్చుకుంటారని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం రాత్రి ఉండిలోని కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్కులో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కనుమూరి భరత్ వర్మ, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రభుత్వ కాలనీకి దారి చూపాలి

సిపిఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు

పోడూరు : పోడూరు చంద్రరాజు చెరువులో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జగనన్న కాలనీకి దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పోడూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రరాజుచెరువులో 174 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీ ఏర్పాటు చేశారన్నారు. వారిలో సగానికిపైగా లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారన్నారు. అయితే ఈ కాలనీకి సరైన దారి లేకపోవడంతో జగనన్న కాలనీలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ ఇచ్చిన కొత్తలో ప్రయివేటు స్థలం మీదుగా తాత్కాలిక రహదారి ఇచ్చారని, ఆ దారిని మూసేయడంతో కాలనీలోకి లారీలు, ట్రాక్టర్లు, కార్లు వంటి వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోయిందన్నారు. అయితే కాలనీకి కాస్తదూరంలో దక్షిణం వైపున ఉన్న పోడూరు-నల్ల వెంకయ్యచెరువు రహదారికి కలిసేలా పొలాల మధ్య నుంచి దారి ఏర్పాటు చేసే విధంగా గత ప్రభుత్వ హయంలోనే రైతుల నుంచి భూ సేకరణ చేసినా డబ్బులు చెల్లించకపోవడంతో అటు దారి ఏర్పాటు చేసేందుకు రైతులు అభ్యంతరం చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. దారి ఏర్పాటుకు కాలనీవాసులు తమ సొంత డబ్బులు కూడా ఇచ్చారని, ఈ సమస్యపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కాలనీవాసులకు శాశ్వత దారిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి : ఎంఎల్ఎ

నరసాపురం : పేదలకు మెరుగైన వైద్యం అందిచేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆదివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన సిబ్బంది అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న వసతులు, పేషెంట్లకు అందుతున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఎంఎల్ఎ వెంట ఆస్పత్రి డైరెక్టర్ పోలిశెట్టి నళిని, ఆసుపత్రి సూపరిటెండెంట్ ఆర్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం : పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలి

సంఘం జిల్లా కార్యదర్శి పి.పూర్ణ

భీమవరం : వచ్చేనెల 13, 14, 15 తేదీలలో ఐద్వా రాష్ట్ర మహాసభలు అనంతపురంలో నిర్వహించుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నాయకులు కేత పద్మజ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఈ మహాసభల సందర్భంగా వాల్ రైటింగ్స్, జెండా ఆవిష్కరణలు, ముగ్గుల పోటీలు నిర్వహించాలన్నారు. డ్వాక్రా సర్వేలు, మైక్రో ఫైనాన్స్‌పై సర్వేలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 13 గంటలు పనిచేయాలని జిఒను తీసుకురావడం చాలా దుర్మార్గమని, దీనివల్ల ఎక్కువగా మహిళలే ఇబ్బందిపడతారన్నారు. రాత్రి సమయంలో విధులు మహిళలకు కేటాయించడం వల్ల భద్రత కరువవుతుందని తెలిపారు. కుటుంబ జీవనం అస్తవ్యస్తంగా మారుతుందని వాపోయారు. ఈ సమావేశంలో బి.శ్యామల, సుగుణ, బి.యశోద, ఎం.సరోజినీ, బి.కళ్యాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో డాక్టర్ వెంపటాపునకు ప్రథమ బహుమతి


బహుమతి అందుకుంటున్న వెంకటాపు

తణుకు : భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ వారి నిర్వహణలో వికసిత్ భారత్ కె రంగ్ కళా కె సంగ్ అంశంపై రాష్ట్ర స్థాయి స్పాట్ పెయింటింగ్ పోటీలు విజయవాడలో నిర్వహించారు. ఈ పోటీలలో వికసిత్ భారత్ -2047 అనే చిత్రాన్ని చిత్రించిన తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. బహుమతిగా రూ.5 వేలు, నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. రాష్ట్రస్థాయి స్పాట్ పెయింటింగ్ పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకోవడం పట్ల స్వగ్రామం ఇరగవరంలోని ప్రముఖులు, తణుకు పట్టణ ప్రముఖులు పలువురు డాక్టర్ వెంపటాపు ను అభినందించారు.

భారత్ జట్టు విజయం ఒక మైలు రాయి : ఎంఎల్ఎ


ఎంఎల్ఎను సత్కరిస్తున్న నేతలు

భీమవరం టౌన్ : ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై భారత్ జట్టు సాధించిన విజయం క్రీడా చరిత్రలో ఒక మలుపు తిప్పిన ఘట్టంగా నిలిచిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో కూటమి నాయకులు స్వీట్స్ పంపిణీ చేసి అంజిబాబును సత్కరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ భారత జట్టు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం, పోరాట స్ఫూర్తి దేశవ్యాప్తంగా ప్రజలను ఆహ్లాదపరిచిందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కుమారుడు పులపర్తి ప్రశాంత్ భారత్ టీం మేనేజర్‌గా గొప్ప విజయం సాధించారని కూటమి నాయకులు అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలు లేఅవుట్ల పరిశీలన

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న పలు లేఅవుట్లను డిఎల్‌డిఒ జి.రాణి, డిఎల్‌పిఒ జ్యోతిర్మయిలు సోమవారం పరిశీలించారు. గ్రామాల్లో లేఅవుట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్న) పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

చేనేత రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు

అక్టోబర్ 6, 7 తేదీలలో సత్తెనపల్లిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యాన మండలంలోని వేల్పూరు గ్రామంలో చేనేత మహాసభల కరపత్రాన్ని చేనేత కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ.. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్లో చేనేతకు నిధుల కేటాయింపులు కోత పెడుతూ చేనేతను కార్పొరేట్ శక్తులకు కట్ట బట్టే దుర్మార్గమైన విధానాలను అవలంబిస్తుందన్నారు. నేతన్నలకు ఉపాధి లేకుండా వృత్తిని దెబ్బతీస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం తన ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు జరపకపోగా గత ప్రభుత్వం అమలు జరిపిన నేతన్న నేస్తం పథకాన్ని పూర్తిగా రద్దు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహకార సంఘాలకు చెల్లించవలసిన రూ.156 కోట్లు విడుదల చేయలేదని ఆయన తెలిపారు. 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు జరపకుండా చేనేత వృత్తి రక్షణకు ఉద్దేశించిన స్కూల్ పిల్లలకు చేనేత వస్త్రాల పేరుతో పవర్ రూమ్ వస్త్రాలు ఇచ్చి స్కూల్ పిల్లల్ని మోసగిస్తూ రూ.కోట్లు దోచుకుంటున్నారని వీరభద్రరావు మండిపడ్డారు. ఈనేపథ్యంలో చేనేత వృత్తి పరిరక్షణకు ఉద్యమ పోరాటాలు రూపొందించేందుకు పల్నాడు జిల్లాలో ప్రముఖ చేనేత కేంద్రం సత్తెనపల్లిలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో చర్చించి తగు కార్యాచరణ రూపొందిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, కొడవటి కోట మల్లయ్య, అందే కోట నరసింహారావు, కొడవటి నాగమణి, చల్లా సోమేశ్వరరావు, అందే పుల్లయ్య పాల్గొన్నారు.

ఆచంట : అక్టోబర్ 6, 7 తేదీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు వాసా ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆచంట వేమవరంలో చేనేత కార్మికులను కలుసుకొని మహాసభల కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తమ్మనాగరాజు, విశ్వనాథ్ పుల్లయ్య, తాళ్ల విగ్నేశ్వరరావు, సిద్దాని మహ్మంకాళీ, తమ్మువీరభద్రుడు, వాసారామలింగం పాల్గొన్నారు.

నేడు బొండాడపేటలో మైక్రో ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల


సిద్ధంగా ఉన్న మైక్రో ఫిల్టర్ ప్లాంట్

బొండాడపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద మైక్రో ఫిల్టర్ ప్లాంట్‌ను డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు మంగళవారం ప్రారంభోత్సవం చేయనున్నట్లు గ్రామ సర్పంచి గుడ్ల మధుసూదనరావు, గ్రామ కార్యదర్శి కె.మణికంఠ సోమవారం తెలిపారు. బొండాడపేట మైనర్ గ్రామ పంచాయతీలో 0.5 ఎంఎల్‌టి సామర్థ్యం గల మైక్రో ఫిల్టర్ ప్లాంట్‌ను మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, కెనరా బ్యాంక్ నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించారు. ఈ గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మైక్రో ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు రఘురామకృష్ణరాజు కృషితో వచ్చాయన్నారు. మంగళవారం మైక్రో ఫిల్టర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

శ్రీ సీతారామ స్వామి ఆలయ ఛైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం


ఆలయ ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎంఎల్ఎ

మండలంలోని కొప్పర్రులో శ్రీసీతారామ స్వామి ఆలయ ఛైర్మన్ గా పోలిశెట్టి గణేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు చినిమిల్లి అప్పారావు, రామనాథం శ్రీను, దొంగ గంగమ్మ, రావూరి నాగలక్ష్మి, అయినపర్తి వీర వెంకట సత్యనారాయణ, దాకరపు రామ లక్ష్మి, మంకు వెంకట సత్యనారాయణ, వాడపల్లి మారుతి, శ్రీనివాసుల సూర్యనారాయణ ఆచార్యులు పాలకవర్గ సభ్యులచే ఇఒ రామచంద్ర కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త కమిటీని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, పోలిశెట్టి శ్రీనివాస్, అందే నరేన్ అభినందించారు.

నెరవేరిన ఉప్పలూరు గ్రామ ప్రజల చిరకాల కోరిక

మైక్రో ఫిల్టర్ ప్రారంభంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు


మైక్రో ఫిల్టర్ ప్రారంభిస్తున్న రఘురామకృష్ణరాజు

ఉండి : మైక్రో ఫిల్టర్‌ల ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధ జలాలను అందించడం ద్వారా గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మైక్రో ఫిల్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రూ.ఐదు లక్షలు కెనరా బ్యాంక్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయగా గ్రామాల్లోని దాతలు కోటిపల్లి రాంబాబు, తన తండ్రి కేశవరావు జ్ఞాపకార్థం రూ.2 లక్షల 15 వేల వ్యయంతో ప్లాంట్‌కు అవసరమైన ప్లాట్‌ఫారం బెడ్డును ఏర్పాటు చేశామన్నారు. మరోదాత యర్రా సూర్యారావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.1,50,000 నిధులతో మైక్రో ఫిల్టర్ ఇన్‌లెట్, అవుట్ లెట్ సామాగ్రిని సమకూర్చడం అభినందనీయమని అన్నారు. గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు మాట్లాడుతూ ఎంఎల్ఎ దృష్టికి తమ గ్రామ తాగునీటి ఇబ్బందులను తీసుకువెళ్లగా శాశ్వత పరిష్కారం చూపించారని కృతజ్ఞతలు తెలియజేశారు. ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణరాజు, వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, నీటిసంఘం అధ్యక్షులు యర్రా సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి కేశవకుమార్ పాల్గొన్నారు.

వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరణ

గణపవరం : వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలిచేందుకు రూపొందించిన డిజిటల్ బుక్ స్థానిక వైసిపి కార్యాలయంలో ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాస్‌రావు(వాసుబాబు) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ డిజిటల్ బుక్ రెండు విధాలుగా పనిచేస్తుందని చెప్పారు. ఒకటి డిజిటల్ బుక్ పోర్టల్ ఫొటోలు, ఆధారాలు కూడా అప్లోడ్ చేయవచ్చునని చెప్పారు. రెండవది ఐవిఆర్ఎస్ నెంబర్ 040 49171718 ద్వారా కార్యకర్తలు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దండురాము, వైసిపి యూత్ అధ్యక్షులు కోడే కాశి, రాష్ట్ర ప్రచారకమిటీ కార్యదర్శి నడింపల్లి సోమరాజు పాల్గొన్నారు.

వంకా రవీంద్ర నాథ్‌కు అభినందనలు

ఆచంట : ఆచంటలో అక్రమంగా జరుగుతున్న ఇసుక మాఫియాపై శాసనమండలిలో విచారణ చేయాలని డిమాండ్ చేసిన శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్‌ను ఆచంట వైసిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు సుంకర సీతారాం మాట్లాడుతూ ప్రజా సమస్యని శాసనమండలిలో లేవనెత్తి ప్రజల తరుపున గళం వినిపించరాని కొనియాడారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న అనేక ప్రజా సమస్యలు శాసనమండలిలో వినిపించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, తప్పెట్ల వెంకట్రావు, దొమ్మేటి రాంబాబు, ముత్యాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

100 మంది చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు విద్యా లక్ష్మి అలంకరణతో అమ్మవారు సరస్వతిదేవిగా యాత్రికులకు దర్శనమిచ్చారు. చిన్నారులచే అక్షరాభ్యాసం, సరస్వతి పూజ నిర్వహించారు. కఠారి శ్రీనివాసరాజు, సూర్యకుమారి దంపతులచే సుమారు 100 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. బొండాడలో సుమారు 200 మంది విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

నెలపర్తి సుమన్, తండ్రి: సుందరరావు, డోర్ నెంబర్: 2-45, ఆగర్తిపాలెం-ఆగర్రు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది. 19-02-2013 లో వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి **K9444075** నెంబర్ పాస్‌పోర్ట్ పొందియున్నాను. నేను ది 20-09-2025 న ఆగర్తిపాలెం లో మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్‌రోడ్ లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజనల్ పాస్‌పోర్ట్ పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెం: 95027 66960

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పవర్‌పేట, చదలవాడ వారి వీధి, డోర్ నెం: 22B-8-20 కి చెందిన మండవ భాగ్యలక్ష్మి, W/o. మండవ పూర్ణచంద్రరావు (లేటు) అను నాయొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. **దస్తావేజులు నెం: 98/1982 Dt. 07-01-1982** రిజిష్టర్డ్ ఏలూరు **SRO** మరియు **2749/1960** రిజిష్టర్డ్ **09-06-1960** ఏలూరు **SRO R.S. No: 55,56** ఎక్స్టంటెట్ **of AC 1-82** సెంట్లు, ఏలూరులో గల సత్రంపాడు ప్రోపర్టి మా భర్త మండవ పూర్ణచంద్రరావు గారిది. ది. 17-09-2025 తేదీన నా యొక్క ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని, ఫైర్ ఆఫీస్ వద్ద జిరాక్స్ సెంటర్‌కు, జిరాక్స్ తీయించు నిమిత్తం వెళ్ళుచుండగా దారి మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మండవ భాగ్యలక్ష్మి
W/o. పూర్ణచంద్రరావు
డోర్ నెం. 22B-8-20,
చదలవాడవారి వీధి,
పవర్‌పేట, ఏలూరు జిల్లా
సెల్ నెం: 95024 22258

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) BHIMAVARAM

Succession O.S.No.2/2025

Between:

Petitioner:
Kayala Venkata Satyanarayana

Vs

Respondent:
The Branch Manager, Union Bank of India. Kalla Branch.

పై నెంబరు లో ది. 05-06-2021 సం॥ తేదీన చనిపోయిన Velivela Ramalakshmi తాలూకు Union Bank of India Kalla Branch లో Dopesite గా వున్న 4,26,113-62 Ps లకు పిటీషన్‌ను తీసుకొనుటకు Legal Representation అధి Succession Certificate ఇప్పించమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున సదరు పిటీషను పై ఎవరికైన ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల **ది. 22-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

సంధి మాణిక్యాలరావు M.A., B.L.,
భీమవరం — అడ్వకేట్, భీమవరం
ది. 29-09-2025 — సెల్: 98661 54492